# మావాళ్ల జోలికొస్తే సహించం

▸ మొదటిపేజీ తరువాయి...

చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఈ హత్యపై ప్రభుత్వం నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. డీజీపీ, ఎస్పీ గ్రామాన్ని స్వయంగా సందర్శించి, మల్లేశ్ హత్యలో పాల్గొన్న నేరస్థుల కాల్‌డాటా రికార్డును పరిశీలించి, ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పార్టీ నేతలతో కలిసి గంట్రావుపల్లిలోని మల్లేశ్‌యాదవ్ కుటుంబసభ్యులను పరామర్శించారు. మల్లేశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బీఆర్‌ఎస్ పార్టీ తరఫున రూ.5 లక్షల చెక్కును మల్లేశ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడి భార్య నిర్మలకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశం కల్పిస్తామని, పిల్లల చదువుల బాధ్యతను పార్టీ స్వీకరిస్తుందని భరోసా ఇచ్చారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. రిటైర్డ్ ఆర్మీ జవాన్ మల్లేశ్ బీఆర్‌ఎస్ గెలుపు కోసం అహర్నిశలు పనిచేశారని గుర్తుచేసుకున్నారు. బీఆర్‌ఎస్ నిబద్ధత కలిగిన కార్యకర్తను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మల్లేశ్ హత్య సంఘటనపై పార్టీ అధినేత కేసీఆర్ తీవ్రంగా కలత చెందారని, వారి కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించాలని సూచించడంతో తాము ఇక్కడికి వచ్చామని వెల్లడించారు. మల్లేశ్ రాజకీయ హత్యను భూ వివాదానికి సంబంధించిన హత్యగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతున్నదనే అనుమానం వ్యక్తం చేశారు. తాము అధికారంలో ఉన్న పదేండ్లలో రాష్ట్రంలో ఎప్పుడూ రాజకీయ హత్యలు, దాడులు, హింసాత్మక సంఘటనలు జరగలేదని గుర్తు చేశారు.



అన్నాసాగర్‌లో ఆల శశివర్ధన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కేటీఆర్

### మల్లేశ్‌ది రాజకీయ హత్యే

కొల్లాపూర్ నియోజకవర్గంలో రాజకీయ ప్రత్యర్థులు కక్షలు, కార్పణ్యాలతో మల్లేశ్‌ను హత్య చేశారని కేటీఆర్ ఆరోపించారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని, ఇలాంటి హత్యలు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. దాడులు, హత్యలు, హింసా సంస్కృతి మంచిది కాదని మంత్రి జూపల్లి కృష్ణారావుకు హితవు చెప్పారు. తాము పదేండ్లు అధికారంలో ఉన్నా ఏ ఒక్క కాంగ్రెస్ కార్యకర్త మీద కానీ, నాయకుల మీద కానీ దాడులకు తెగబడలేదని, ఇలాంటి సంస్కృతిని ఎప్పుడూ ప్రోత్సహించలేదని పేర్కొన్నారు. తాము కూడా దుష్ట సంస్కృతిని ప్రోత్సహించి ఉంటే పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. ప్రభుత్వంలో ఎవరున్నా ఇలాంటి దుర్మార్గమైన నేరానికి పాల్పడిన వారిపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకోవాలని, మల్లేశ్ కుటుంబానికి న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రారంభమైన హత్య రాజకీయాలు, రాజకీయ హింసా సంస్కృతిని మీడియా ప్రజల ముందుంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, అలంపూర్, కోరుట్ల ఎమ్మెల్యేలు విజయుడు, సంజయ్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ అల్లీపూర్ వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రంగినేని అభిలాష్‌రావు, గుజ్జుల పరమేశ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షులు గణేశ్‌రావు, రాజశేఖర్‌గౌడ్, రామచందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆల కుటుంబానికి పరామర్శ

భూత్పూర్: మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితోపాటు ఆయన కుటుంబసభ్యులను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సోదరుడు ఆల శశివర్ధన్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో మరణించారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లో ఆదివారం శశివర్ధన్‌రెడ్డికి ఏకాదశ దినకర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కేటీఆర్.. శశివర్ధన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శశివర్ధన్‌రెడ్డి తల్లి వరలక్ష్మి, భార్య శ్రీలతను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు వాల్యానాయక్, ఇంతియాజ్ ఇషాక్, రజిని, అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీపీలు కదిరె శేఖర్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, గుంత మౌనిక, రమాశ్రీకాంత్, జెడ్పీటీసీలు రాజశేఖర్‌రెడ్డి, ఇంద్రయ్యసాగర్, మున్సిపాలిటీ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు సత్తూర్ నారాయణగౌడ్, కాటం ప్రదీప్‌గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. కేటీఆర్ రాకను తెలుసుకున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు అన్నాసాగర్‌కు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు.

### ఈసారి కూడా కాంగ్రెస్, బీజేపీ కలిసి పనిచేసే అవకాశం: కేటీఆర్

*హైదరాబాద్: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ రాష్ట్రంలో మరోసారి కలిసి పనిచేస్తాయనడానికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలే నిదర్శనమని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పేర్కొన్నారు. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్, నిజామాబాద్ నియోజకవర్గాల్లో బీజేపీ గెలుపునకు కాంగ్రెస్ తోడ్పాటును అందించిందని ఉదహరించారు. ఈ మేరకు ఆదివారం ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ట్వీట్ చేశారు.*

## లోకం పోకడ




## ఉచిత చేపపిల్లల పంపిణీ కొనసాగించాలి: కొండూరు



*హైదరాబాద్, జనవరి 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని మత్స్యకారులకు భరోసా కల్పించేందుకు కేసీఆర్ ప్రభుత్వం తలపెట్టిన ఉచిత చేపపిల్లల పంపిణీ పథకాన్ని కొనసాగించాలని జాతీయ ఎంబీసీ సంఘాల సమితి విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలోని 47 వేల చెరువుల్లో, 6,800 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయని ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ పేర్కొన్నారు. వారి సంక్షేమం నిమిత్తం పెండింగ్‌లో ఉన్న రూ.104 కోట్ల బిల్లును విడుదల చేయాలని, ఈ ఏడాది కూడా ఉచితంగా చేపపిల్లలు పంపిణీ చేయాలని కోరారు.*

# హైదరాబాద్‌లో కరెంటు కోతలు

▸ మొదటిపేజీ తరువాయి...

ఉండవచ్చు. మెయింటనెన్స్ పనిని బట్టి ఆయా ప్రాంతాల్లో 30 నిమిషాల నుంచి 2 గంటల వరకు ఉండే అవకాశం ఉన్నది అని వివరించారు. 'మెయింటనెన్స్ అనేది నిరంతర ప్రక్రియ. ఇది ప్రతి రెండో శనివారం జరుగుతుంది. మొత్తం విద్యుత్తు సరఫరాపై ఇది ప్రభావం చూపదు' అని వెల్లడించారు.

### అప్పుడే కోతలా!

ముషారఫ్ ప్రకటనపై నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నెలరోజుల్లోనే తెలంగాణకు మళ్లీ కరెంటు కోతలు తీసుకొచ్చిందని ఎద్దేవా చేస్తున్నారు. నిషేధిత మెటాలిక్ కైట్ మాంజాలతో విద్యుదాఘాతాలు కలిగే అవకాశమున్నందున అంతరాయాలు అనివార్యమవుతున్నాయని ప్రకటించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. గాలిపటాలతో గ్రేటర్‌లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని చెప్పటం హాస్యాస్పదంగా ఉన్నదన్న మండిపడుతున్నారు. ముషారఫ్ తన ట్వీట్‌లను తొలగించినప్పటికీ వాటి స్క్రీన్‌షాట్లను నెటిజన్లు భారీగా షేర్‌చేశారు. సికింద్రాబాద్ ప్రాంతంలోని కొన్ని కాలనీల్లో అర్ధరాత్రి కూడా చాలాసేపు కరెంటు తీసేస్తున్నారని, ఆ సమయంలో ఏం మెయింటనెన్స్ పనులు చేస్తున్నారని నిలదీస్తున్నారు. గత తొమ్మిదేండ్లలో మెయింటనెన్స్ చేయలేదా? అప్పుడు ఇలాగే కరెంటు కోతలు ఏర్పడలేదు కదా? అని ప్రశ్నిస్తున్నారు.

## హత్య బెదిరింపు కాల్స్ వచ్చాయ్

- డబ్ల్యూఎఫ్ఐ సంజయ్‌సింగ్ ఫిర్యాదు

వారణాసి: తనను, డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్‌ను చంపేస్తామంటూ గుర్తు తెలియని వ్యక్తి నుంచి బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చాయని ఇటీవల సస్పెన్షన్‌కు గురైన డబ్ల్యూఎఫ్ఐ కొత్త అధ్యక్షుడు సంజయ్ సింగ్ పేర్కొన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు వారణాసి పోలీసులు ఆదివారం తెలిపారు. ఈ నెల 12న రాత్రి సమయంలో ఒక వ్యక్తి గుర్తు తెలియని నంబర్ నుంచి రెండు సార్లు ఫోన్ చేశాడని, తాను లిఫ్ట్ చేయలేదని పేర్కొన్నారు. తర్వాతి రోజున అదే నంబర్ నుంచి మళ్లీ కాల్ రాగా.. లిఫ్ట్ చేశానని, తనను, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను హత్య చేస్తానని ఆ దుండగుడు బెదిరించారని తెలిపారు.

## తప్పిపోయిన 13 ఏండ్ల తర్వాత దొరికిన భార్య

కోల్‌కతా, జనవరి 14: తప్పిపోయిన భార్యాబిడ్డలను ఒక వ్యక్తి 13 ఏండ్ల తర్వాత కలుసుకున్న అరుదైన ఘటన కోల్‌కతాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన లనిత్ బరేత్ 2010లో మానసిక స్థితి సరిగ్గా లేని తన భార్య గుర్బారీ (27), 11 ఏండ్ల పిల్లాడితో 2010లో కోల్‌కతాలో చికిత్స కోసం వచ్చాడు. అయితే భార్య, బిడ్డలు ఆ మహా నగరంలో తప్పిపోయారు. అయితే గుర్బారీ పోలీసులకు దొరికినా ఆమె తన అడ్రస్, వివరాలు చెప్పలేకపోవడంతో ఆమెను దవాఖానలో, ఆమె కుమారుడిని అనాథాశ్రమంలో చేర్చారు. అయితే గుర్బారీకి పూర్తిగా నయమైందని దవాఖాన అధికారులు ఇటీవల చెప్పడంతో ఆమె చిరునామా కోసం పోలీసులు వెతుకులాట ప్రారంభించారు. అయితే గంగాసాగర్ మేళాకు వచ్చిన లనిత్‌కు భార్య, కుమారుడి గురించి తెలియడంతో వారిని పట్టుకుని ఆనంద భాష్పాలు రాల్చాడు. వారు ఎప్పటికైనా తిరిగి వస్తారన్న నమ్మకం తనకు ఉందని, అందుకే తాను రెండో పెండ్లి కూడా చేసుకోలేదని చెప్పాడు.

# కర్ణాటకలోనే కరువు.. తెలంగాణకేం ఆదరువు?

- ఆల్మట్టిలో ఉన్నది 56 టీఎంసీల జలాలే
- నారాయణపూర్‌లోనూ అంతంత మాత్రమే
- 10 టీఎంసీలు వదిలినా దిగువకు చుక్కరాదు
- మధ్యలో దాదాపు 5 భారీ ఆనకట్టలు
- అందులోనే నిలిచిపోయే అవకాశం
- కర్ణాటక రాష్ట్ర పర్యటనకు తెలంగాణ సర్కారు యత్నాలు
- ప్రభుత్వ తీరుతో విస్తుపోతున్న ఇంజినీర్లు

హైదరాబాద్, జనవరి 14 (నమస్తే తెలంగాణ): తాగునీటి కోసం మహారాష్ట్రలోని కోయినా నుంచి తొలుత 30 టీఎంసీలను అడగాలని నిర్ణయించుకున్న తెలంగాణ సర్కారు, ఇప్పుడు కర్ణాటక రాష్ట్రాన్ని కూడా 10 టీఎంసీలు కోరాలని యోచిస్తున్నది. కృష్ణా నీటిని కోరేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం కర్ణాటకలో త్వరలో పర్యటించనున్నదని సాగునీటిపారుశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల స్వయంగా తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంపై ఇంజినీర్లు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ప్రతిపాదనలకు పూర్తి భిన్నంగా క్షేత్రస్థాయిలో పరిస్థితులున్నాయని అంటున్నారు. ప్రస్తుతం ఆ రాష్ట్రంలోని నీటినిల్వలు కూడా అదే విషయాన్ని రుజువు చేస్తున్నాయి. అయినప్పటికీ ప్రభుత్వం ఎలాంటి కసరత్తు లేకుండా ఈ ప్రతిపాదనలు చేయాలని యోచిస్తుండటంపై అధికారులు విస్తుపోతున్నారు.

### కర్ణాటకలో తీవ్ర కరువు

గత దశాబ్దకాలంలో ఎన్నడూ చూడని కరువు పరిస్థితులను ప్రస్తుతం కర్ణాటక రాష్ట్రం ఎదుర్కొంటున్నది. ముఖ్యంగా అప్పర్ కృష్ణా బేసిన్.. అంటే కలబురగి, రాయచూర్, బాగల్‌కోట్, యాద్గిరి జిల్లాలో కరువు తాండవిస్తున్నది. కర్ణాటకలోని 31 జిల్లాల్లో ఉన్న 236 తాలుకాల్లో తొలి విడతలోనే 216 తాలూకాలను కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించారంటే పరిస్థితిని ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ఇక అప్పర్‌కృష్ణా బేసిన్‌లోని ఆల్మట్టి, నారాయణపూర్ డ్యామ్‌లలో కలిపి మొత్తం 81.76 టీఎంసీల నీరు ఉండగా, అందులో వినియోగానికి 47 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఆ జలాల్లోనూ ఆ రాష్ట్ర తాగునీటి అవసరాలకు 37 టీఎంసీలు కేటాయించుకున్నారు. ఇతర అవసరాలకు 3 టీఎంసీలను పెట్టుకున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో పంటలు సాగు చేయవద్దని కర్ణాటక ప్రభుత్వం కోరినా ఆయా ప్రాజెక్టుల పరిధిలోని జిల్లాల రైతులు వరి పంటకు బదులు మిర్చి సాగు చేస్తున్నారు. వారికి సాగునీరివ్వడానికే ఆ రాష్ట్ర ప్రభుత్వం వెనకడుగు వేస్తున్నది. మరోవైపు రైతులు నీళ్లకోసం ధర్నాలు చేస్తున్నారు. కలబురగి, రాయచూర్, బాగల్‌కోట్, యాద్గిరి జిల్లాల ఇన్‌చార్జి మంత్రులు, ఎమ్మెల్యేలతో ఆ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి శివకుమార్ ఇటీవల ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి 2.75 టీఎంసీల నీటిని విడుదల చేస్తామని ప్రకటించారు. అలాంటి కరువు పరిస్థితుల్లో ఉన్న కర్ణాటక ఇప్పుడు తెలంగాణకు 10 టీఎంసీలు ఇస్తుందా? అనేది పెద్ద ప్రశ్నగా మారింది. ప్రభుత్వం ఇచ్చినా అక్కడి రైతులు ఊరుకుంటారా? అన్నది కూడా అనుమానమే.

| ప్రాజెకు | నీటి నిల్వ సామర్థ్యం | ప్రస్తుతం నిల్వ (టీఎంసీల్లో) | నిరుడు ఇదే సమయానికి |
|---|---|---|---|
| కోయినా | 105.27 | 75 | ---- |
| ఆల్మట్టి | 129.72 | 56 | 88.41 |
| నారాయణపూర్ | 37.64 | 25.76 | 33.34 |

### నీళ్లు రావడమూ అనుమానమే

కర్ణాటక ప్రభుత్వం తెలంగాణకు 10 టీఎంసీల నీరు ఇవ్వడానికి అంగీకరించినా అవి ఇక్కడి రావడం కష్టమే. 10 టీఎంసీల్లో దాదాపు 25 శాతానిపైగా ట్రాన్స్‌మిషన్ నష్టాలుగా పోనున్నాయి. మిగిలిన నీళ్లన్నా వస్తాయా అన్నది అనుమానమే. ఆల్మట్టి నుంచి జూరాల ఎగువన కర్ణాటకలో కృష్ణా నదిపై ఇప్పటికే పదుల సంఖ్యలో ఆనకట్టలు నిర్మించింది. అందులో దాదాపు 5 ఆనకట్టల సామర్థ్యం 2 టీఎంసీలకు మించి ఉంటుందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. వాటిల్లో ప్రస్తుతం తగినంత నీరు లేదు. తెలంగాణ కోరికమేరకు కర్ణాటక నీటిని విడుదల చేసినా అవి ఆ ఆనకట్టలను దాటి రావడం కష్టమేనని అధికారులు చెప్తున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులు ఇంత భిన్నంగా ఉన్నా కూడా తెలంగాణ ప్రభుత్వం నీళ్ల కోసం కర్ణాటకను అడుగుతామని ప్రకటించటం అందరినీ విస్మయానికి గురి చేస్తున్నది.

## కోయినా కింద కూడా అదే పరిస్థితి

ఎగువన మహారాష్ట్రలోని కోయినా డ్యామ్ పరిధిలోని పరిస్థితి కూడా ఇదే రీతిన ఉన్నది. డ్యామ్‌లో ప్రస్తుతం 75 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నది. ఆ డ్యామ్ సతారా, సాంగ్లి, సోలాపూర్ జిల్లాల తాగునీటి అవసరాలకు ప్రధాన ఆయువు. ఈ ఏడాది అక్కడ కూడా తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర సర్కారు ఈ ఏడాది కొయినా డ్యామ్ కింద ఆయకట్టుకు సాగుకు కోత విధించింది. తాగునీటికి మాత్రమే ఇస్తామని ప్రకటించింది. ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణకు ఆ ప్రభుత్వం నీళ్లు ఇస్తుందా అనేది అనుమానమే.

## చలి వణుకు

| | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 12.9°c | 35.0°c |
| రంగారెడ్డి | 14.5°c | 34.3°c |
| మెదక్ | 16.2°c | 33.6°c |
| వరంగల్ | 18.0°c | 31.0°c |
| కరీంనగర్ | 18.0°c | 32.0°c |
| ఖమ్మం | 18.0°c | 32.0°c |
| నల్లగొండ | 18.0°c | 33.0°c |
| హైదరాబాద్ | 18.7°c | 33.2°c |
| నిజామాబాద్ | 19.5°c | 31.9°c |
| మహబూబ్‌నగర్ | 20.5°c | 33.1°c |

# మునగ సేద్యం.. లాభాలు ఘనం

- కాయలతోపాటు ఆకులోనూ ఔషధ గుణాలు
- పౌడర్‌గా మార్చి విక్రయం.. వంద గ్రాములు రూ.100
- వ్యాధులు దూరం.. ఆరోగ్యానికి ఎంతో మేలు
- గన్నేరువరం మండలం మైలారంలో సాగు చేస్తున్న రైతు

తిమ్మాపూర్/గన్నేరువరం, జనవరి 14: మునగ చెట్టు రానురానూ వాణిజ్య పంటగా మారిపోతున్నది. మునగ కాయలతోపాటు వాటి ఆకులోనూ అనేక ఔషధ గుణాలు ఉండడం, అవి ఆరోగ్యానికి ఎంతోమేలు చేస్తుండటంతో రైతులు ఈ పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఈ విషయంలో కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం మైలారంలోని రైతు దంపతులు ముత్యాల రజినీ రమణారెడ్డి అందరి కంటే వినూత్నంగా ముందుకు సాగుతున్నారు. కేవలం మునక్కాయలను అమ్మడమే కాకుండా మునగ ఆకును పొడిగా తయారు చేసి విక్రయించడం ద్వారానూ లాభాలు పొందుతున్నారు.

### ఎకరంలో సాగు

వ్యవసాయమే జీవనాధారంగా ముందుకు సాగుతున్న ముత్యాల రజినీ రమణారెడ్డి దంపతులు గతంలో వివిధ రకాల పంటలు వేసినా అంతగా ప్రయోజనం లేకపోయింది. దీంతో కొత్తగా ఏదైనా చేయాలని భావించిన ఆ దంపతులు.. నాబార్డు అధికారుల సూచనతో మునగ తోట సాగు చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా ఏడాది క్రితం తక్కువ ఖర్చుతో ఎకరం భూమిలో మునగ మొక్కలు నాటి, డ్రిప్ ద్వారా నీరు పెడుతున్నారు. సాధారణంగా మునగకు నీరు అవసరం ఉండదు. కానీ, రజినీ రమణారెడ్డి దంపతులు మునగ ఆకును సేకరించి పౌడర్ తయారు చేస్తున్నందున ఎక్కువ నీరు అందిస్తున్నారు. దీంతో ఆకు త్వరగా పెరుగుతున్నది.



కరీంనగర్ జిల్లా మైలారంలోని తోటలో మునగ చెట్టు ఆకులు తెంపుతున్న రజినీరమణారెడ్డి దంపతులు

### వంద గ్రాముల ప్యాకెట్ రూ.100

మునగ ఆకును పౌడర్ చేసి విక్రయించుకునేలా రైతులను ప్రోత్సహిస్తున్న అధికారులు.. అందుకు అవసరమైన యంత్రాలను రజినీ రమణారెడ్డి దంపతులకు అందజేశారు. వీటి సాయంతో వారు మునగ ఆకును పొడిగా తయారు చేసి, 100 గ్రాముల ప్యాకెట్‌ను రూ.100 చొప్పున స్థానికంగానే విక్రయిస్తున్నారు.

### ప్రభుత్వం చొరవ తీసుకుంటే..

మైలారంతోపాటు చిగురుమామిడి మండలం సుందరగిరిలో ఇప్పటికే పలువురు రైతులు నాబార్డు సాయంతో మునగ సాగు చేస్తున్నారు. కానీ, మునగ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై ప్రజలకు సరైన అవగాహన లేకపోవడంతో రైతులకు లాభాలు నామమాత్రంగా ఉన్నాయి. ప్రభుత్వం చొరవ తీసుకుని పాఠశాలల్లో విద్యార్థులకు అంగన్‌వాడీల ద్వారా గర్భిణులకు మునగ ఆకు పౌడర్‌ను అందిస్తే పౌష్టికాహార లోపాన్ని నివారించడంతోపాటు రైతులకూ లాభం చేకూరుతుంది.

### అవగాహన పెంచాలి..



మునగ వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నప్పటికీ వాటిపై ప్రజలకు సరైన అవగాహన లేదు. దీంతో డిమాండ్ అంతంత మాత్రంగానే ఉన్నది. నేను ఎకరం లో సాగుచేసిన మొక్కలతో చాలా పౌడర్ తయారు చేయవచ్చు. కానీ, మార్కెటింగ్ సౌకర్యం లేక ఇబ్బంది అవుతున్నది. ప్రభుత్వం చొరవ తీసుకుని మునగ వల్ల కలిగే లాభాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తే మార్కెటింగ్ పెరిగి మాకు మరింత ఆదాయం లభిస్తుంది. ఆ దిశగా ప్రభుత్వం, అధికారులు చొరవ తీసుకోవాలి.

**- ముత్యాల రమణారెడ్డి, రైతు, మైలారం**

## ఎన్నో ఉపయోగాలు

*మునగ ఆకు పౌడర్‌ను రోజూ గ్రాము చొప్పున తీసుకుంటే బహుళ ప్రయోజనాలు చేకూరుతాయి. పాలు, క్యారెట్, ఓట్స్, అరటి పండ్లు, ఆకుకూరల్లో ఉండే విటమిన్లన్నీ మునగ ఆకు పౌడర్‌లో లభిస్తాయి. దీని వినియోగంతో ఎన్నో అనారోగ్య సమస్యలు దూరమవుతాయి. పలు రకాల వ్యాధుల చికిత్సకు ఉపయోగించే మునగ ఆకులో విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు, అమినో యాసిడ్స్, సమృద్ధిగా ఉంటాయి. క్యారెట్ కంటే మునగ ఆకులో విటమిన్లు ఎన్నో రెట్లు అధికంగా ఉంటాయి. థైరాయిడ్‌ను అదుపులో ఉంచే సహజ ఔషధంగా పేరున్న మునగ ఆకును కంటి వ్యాధులకు సంబంధించిన మెడిసిన్‌లోనూ వాడతారు. ఇందులో ఉండే క్లోరోజెనిక్ యాసిడ్‌తో షుగర్ లెవల్స్ కంట్రోల్ అవుతాయి. మునగ ఆకు రసాన్ని పాలలో కలిపి పిల్లలకు అందిస్తే ఎముకలు బలంగా తయారవుతాయి. గర్భిణులు, బాలింతల్లో కాల్షియం, ఐరన్ లోపాన్ని తొలగించేందుకు మునగ ఆకు ఎంతో ఉపయోగపడుతుంది.*

# మేడిగడ్డపై ఎందుకింత జాప్యం?

- విచారణ పేరిట కాలయాపన!
- పిల్లర్ పునరుద్ధరణ పనుల్లో నిర్లక్ష్యం
- క్రాప్ హాలిడేపై రైతుల ఆగ్రహం
- అన్నదాతకు కాళేశ్వరం ప్రాజెక్టుతోనే భరోసా
- పంటలకు నీళ్లివ్వలేని దుస్థితిలో ప్రభుత్వం

జయశంకర్ భూపాలపల్లి, జనవరి 14 (నమస్తే తెలంగాణ): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ (లక్ష్మీ బరాజ్)లో కుంగిన పిల్లర్‌పై ప్రభుత్వం విచారణ పేరిట కాలయాపన చేస్తుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం విచారణకు ఆదేశించిన డైనోసార్ ఏజెన్సీ ఇప్పటికీ ఇన్వెస్టిగేషన్ పనులను కొనసాగిస్తూనే ఉన్నది. ఏజెన్సీ రోజుల తరబడి విచారణ కావాలనే జాప్యం చేస్తుందా? లేక ప్రభుత్వ ఆదేశాల మేరకే కాలయాపన చేస్తున్నదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పరిస్థితి ఇలా ఉంటే యాసంగికి నీరెలా అని రైతులు ఆందోళన చెందుతున్నారు. మేడిగడ్డపై సర్కార్ తాత్సారంపై మండిపడుతున్నారు. గత ఏడాది అక్టోబర్ 21న మేడిగడ్డ బరాజ్ ఏడో బ్లాకు 20వ పిల్లర్ కుంగడంతో ఎల్అండ్‌టీ ప్రతినిధులు సందర్శించి పునరుద్ధరణ పనులు చేపడతామని వెల్లడించిన విషయం తెలిసిందే. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ బృందం, డ్యాం సేఫ్టీ రివ్యూ ప్యానల్ టీం సైతం సందర్శించి కుంగుబాటుపై నివేదిక ఇచ్చింది. ఇటీవల మంత్రుల బృందం మేడిగడ్డ, అన్నారం బరాజ్‌లను సందర్శించి బరాజ్‌లను ఇన్వెస్టిగేషన్ చేయాలని ఆదేశించింది. మేడిగడ్డ, అన్నారం (సరస్వతీ బరాజ్) బరాజ్‌ల వద్ద పునాదుల పరిశీలన కోసం నిర్మాణ సంస్థలు వాహనాల రాకపోకలకు అనుగుణంగా రోడ్డు ఏర్పాటు చేయగా ఇన్వెస్టిగేషన్ బాధ్యతలను డైనోసార్, పార్సన్ అనే ఏజెన్సీలకు అప్పగించిన విషయం తెలిసిందే. డైనోసార్ ఏజెన్సీ ఇన్వెస్టిగేషన్ పనులను ఈ నెల 5న ప్రారంభించి ఇప్పటికీ కొనసాగిస్తూనే ఉన్నది. ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసిన అనంతరమే పునరుద్ధరణ పనులు ప్రారంభం కానున్నాయి.



మేడిగడ్డ బరాజ్ వద్ద కొనసాగుతున్న ఇన్వెస్టిగేషన్ పనులు

### సా..గుతున్న పరీక్షలు..

డైనోసార్ కంపెనీ ప్రతినిధులు ఇన్వెస్టిగేషన్‌లో భాగంగా ఎలక్ట్రిసిటీ రెసిస్టెంట్ టెస్ట్ (ఈఆర్‌టీ)తోపాటు ఇతర పరీక్షలు కొనసాగిస్తూనే ఉన్నారు. విచారణ త్వరగా పూర్తయితే 19, 20, 21వ పిల్లర్ల వద్ద కాఫర్ డ్యాం పనులను వేగవంతం చేసేందుకు నిర్మాణ సంస్థ సిద్ధంగా ఉన్నది. విచారణ నివేదిక ఆధారంగా ఈ మూడు పిల్లర్లను డైమండ్ కటింగ్‌తో తొలగించి మళ్లీ పనులు చేపట్టే అవకాశాలున్నాయి. అయితే ఇన్వెస్టిగేషన్ పనుల్లో జాప్యం జరుగుతుండటంతోపాటు ఇటీవల విజిలెన్స్ అధికారులు మూడు రోజులపాటు రికార్డుల తనిఖీ నిర్వహించడంతో ఇన్వెస్టిగేషన్ పనుల్లో మరింత జాప్యం నెలకొన్నది. బరాజ్‌లపై విచారణ, మరమ్మతు పనులు ఏకకాలంలో జరిగితేనే ప్రాజెక్టుకు చికిత్స జరిగినట్టు ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు. మరోవైపు అన్నారం బరాజ్‌లోని 28, 38 ఔట్‌లెట్ల వద్ద ఏర్పడిన చిన్న చిన్న సీపేజ్‌లకు ట్రీట్‌మెంట్ ప్రారంభమైంది. నిర్మాణ సంస్థ ఆఫ్కాన్స్ సీపేజ్‌లకు ప్రత్యేక కెమికల్‌తో గ్రౌటింగ్ పనులు ప్రారంభించింది. 15 రోజుల్లో పనులు పూర్తి చేసి అన్నారం బరాజ్‌ను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురానున్నారు. ఇదిలావుండగా కాళేశ్వరం ప్రాజెక్టు విలువ ఇప్పుడు తెలిసి వస్తుందని, యాసంగికి నీరు ఇచ్చేందుకు ప్రభుత్వం తడుముకునే పరిస్థితి వచ్చిందని రైతులు పేర్కొంటున్నారు. అన్నదాతకు కాళేశ్వరం ప్రాజెక్టే పెద్ద దిక్కని వారు స్పష్టం చేస్తున్నారు.

## నిపుణ
విద్య, ఉద్యోగ సమాచారం

### ఎన్‌సీఎల్‌లో..

**నార్తర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్ (ఎన్‌సీఎల్)లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 150
- పోస్టులు: అసిస్టెంట్ ఫోర్‌మెన్
- విభాగాలు: ఈ అండ్ టీ, మెకానికల్, ఎలక్ట్రికల్
- అర్హతలు, ఎంపిక కోసం వెబ్‌సైట్ చూడవచ్చు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: ఫిబ్రవరి 5
- వెబ్‌సైట్: https://www.nclcil.in

### ఎయిమ్స్‌లో...

**మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో కాంట్రాక్టు ప్రాతిపదికన కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 125
- పోస్టులు: ప్రొఫెసర్, అడిషనల్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్
- విభాగాలు: అనస్థీషియాలజీ, అనాటమీ, బయో కెమిస్ట్రీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 29
- వెబ్‌సైట్: https://www. aiimsmangalagiri.edu.in

### ఫ్యాకల్టీలు

**నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రెయినింగ్ అండ్ రీసెర్చ్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- మొత్తం ఖాళీలు: 9
- పోస్టులు: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, సెక్షన్ ఆఫీసర్
- దరఖాస్తు, చివరితేదీ తదితరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు
- వెబ్‌సైట్: http://www.nitttrkol.ac.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- బయాలజీ, పాలిటీ, ఇంగ్లిష్ గ్రామర్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.